క్లుప్తంగా

ఆర్కే శ్రీరామనవమి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నగరంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే గురువారం శ్రీరామనవమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సీతారాములను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజలు ఆనందోత్సవాలతో పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

గాలికుంటు నివారణ టీకాలు



ఫిరంగిపురం: పలు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ చెప్పారు. గుండాలపాడు గ్రామంలో బుధవారం 174 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. పశువుల కాలిగిట్టల మధ్య పుండ్లు, నోటికి ఇరువైపులా వాపుతోకూడిన పుండ్లు రావడం, మేత తీసుకోకపోవడం గాలికుంటు వ్యాధి లక్షణాలని వివరించారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

మంగళగిరి: నగరంలోని వీసం నాగేశ్వరరావు, జయప్రద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కొత్తపేటలోని జూనియర్ కళాశాల ఆవరణలో సొసైటీ నిర్వాహకులు సుమారు రూ. 50 వేల విలువ కలిగిన ప్యాడ్‌లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వి.వి.ప్రసాద్, వీసం వెంకటేశ్వరరావు, వి.వి. జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

'దేశానికి మోదాని ముప్పు పుస్తక' ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్ : 'దేశానికి మోదాని ముప్పు' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీ పీడ నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



బడేపురం(తాడికొండ): చిరుధాన్యాలతో చేసిన వంటకాలతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కృష్ణకుమారి చెప్పారు. పోషణ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా తాడికొండ శివారు బడేపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. చిరుధాన్యాల వాడకం ఆరోగ్యానికి మంచిదని, వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవని, కనీసం వారంలో రెండు రోజులైనా వీటిని వాడాలని సూచించారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. వాటి తయారీ విధానంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే నాగరాజ పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు కార్యక్రమం



తాడేపల్లిరూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఎర్రబాలెం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో యూపీహెచ్‌సీ పరిధిలోని పెనుమాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు వి.వి.కర్ణ మాట్లాడుతూ సుమారు 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, తొమ్మిది మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని, కంటి ఆపరేషన్ అవసరమైన ఆరుగురిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం భువనేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ తరంగం



ఈనెల 31, ఏప్రిల్ 1 తేదీలలో మోతదక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ లెవల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం గుంటూరులోని హాలీవుడ్–బాలీవుడ్ థియేటర్ సమీపంలో కళాశాల విద్యార్థులతో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో నగరవాసులను అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఫెస్ట్ కన్వీనర్ వి.నాగగోపీరాజు, కల్చరల్ కన్వీనర్ డాక్టర్ బి.తులసీ రాణి పాల్గొన్నారు.

–తాడికొండ

దివ్య శోభారామాలు



శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలు కల్యాణ శోభతో కళకళలాడుతున్నాయి. సుందరంగా ముస్తాబై సీతారాములను కొలిచేందుకు నిరీక్షిస్తున్నాయి. విద్యుద్దీప అలంకరణలో ధగధగ మెరిసిపోతున్నాయి. తాడేపల్లి సీతానగరంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం దత్తత ఆలయమైన సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి గుడితో పాటు తక్కెళ్లపాడులోని కోదండ రామాలయం పండగ కాంతుల్లో తళుకులీనుతున్నాయి.

– తాడేపల్లిరూరల్/ఫిరంగిపురం

ఎమ్మెల్యే ఆర్కే ఆపన్నహస్తం

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ సాయాన్ని బుధవారం బాధిత కుటుంబాలకు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్) అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రాచకొండ ధనలక్ష్మి కుటుంబానికి రూ.15 వేలు, అనారోగ్యానికి గురై మృతి చెందిన పొనుగుబాటి సుబ్బారావు కుటుంబానికి రూ.15 వేలు, ఈమనిలోని సగర కాలనీలో మృతి చెందిన నగలం సాంబయ్య కుటుంబానికి రూ.15 వేలు, ఇదే కాలనీలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన గండికోట సుబ్బారావు కుటుంబానికి రూ.15 వేలు, ఈమని ఎస్సీ కాలనీకి చెందిన గేరా రాజారత్నం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే ప్రకటించారని, ఆ మొత్తాలను బుధవారం బాధిత కుటుంబాలకు అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తే ఆనంద్, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి, శ్రీనివాసరావు, రాము, గండికోట శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థికాభివృద్ధి


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఫిరంగిపురం: జగనన్న సంక్షేమ పాలనతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతోందని సర్పంచ్ జి.నాగ మల్లేశ్వరి చెప్పారు. నుదురుపాడు గ్రామంలో డ్వాక్రామహిళల ఆధ్వర్యంలో జగనన్న ఆసరా సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. ఇప్పటివరకు గ్రామంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా రూ.63 లక్షలు అందినట్లు ఏపీఎం సుజాత వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఉత్తమ ఏపీఎంగా రాష్ట్రస్థాయిలో అవార్డు వచ్చిన ఏపీఎం సుజాత, ఉత్తమ వీవోఏగా అవార్డు వచ్చిన పద్మావతిని మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఐలా సీతారామిరెడ్డి, చైతన్య, యూనియన్ బ్యాంకు మేనేజర్లు కిషోర్, రాధిక, సీసీ కృపారావు, వీవో అధ్యక్షులు నాగరాణి, మస్తాన్‌బి, ఎం.కుమారి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో పెనుముప్పు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ అధికారులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కాలేజీ విద్యార్థులకు బుధవారం మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి, గుంటూరు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.ఎస్.మహేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి, హెరాయిన్ తదితర మత్తుపదార్థాల వల్ల కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె బలహీనమవుతాయని, విచక్షణ జ్ఞానాన్ని కోల్పోతామని విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించి మంచి మార్కులు సాధించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గుంటూరు ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ మణికంఠ, గుంటూరు ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.చలం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాహిర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటితో ఆధునికీకరణ పనులు


సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం పనులు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో రూ.కోటితో ఆధునికీకరణ పనులను అధికారులు చేపట్టారు. బైపాస్‌రోడ్ దగ్గర నుంచి ఎన్టీఆర్ కరకట్ట, రైల్వే బ్రిడ్జి, బోటుయార్డు మీదుగా స్క్రూ బ్రిడ్జి వరకు రోడ్డుకు రెండు వైపులా మొక్కలను నాటడం, ఓల్డ్ టోల్‌గేట్ దగ్గర నుంచి బకింగ్‌హామ్ కెనాల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం, ఉండవల్లి సెంటర్ వరకు లైటింగ్ ఏర్పాటు చేయడానికి కార్పొరేషన్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు బుధవారం డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే తాడేపల్లి ఓల్డ్ టోల్‌గేటు దగ్గర నుంచి బకింగ్‌హామ్ కెనాల్ వరకు రోడ్ మధ్య డివైడర్లలో ఉన్న హానికర కాన్‌కార్పస్ మొక్కలను బుధవారం తొలగించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన మసూద్

మేడికొండూరు: ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేరేచర్ల ఆరోమైలు వద్ద బుధవారం జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన షేక్ మసూద్ (23) ఫ్రిజ్, కూలర్లు మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రోజూ మాదిరిగానే పేరేచర్లలో ఏసీ రిపేర్ చేసి తిరుగు ప్రయాణంలో బ్రాహ్మణపల్లి వెళ్తున్న సమయంలో పేరేచర్ల ఆరోమైలు, కైలాసగిరి వద్ద డస్ట్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వెళ్తున్న మసూద్ ద్విచక్రవాహన్ని ఢీకొన్నాడు. ఘటనలో మసూద్ కిందపడ్డాడు. ట్రాక్టర్ మసూద్ మీదుగా వెళ్లింది. తీవ్రగాయాల పాలైన మసూద్‌ను 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మసూద్ మృతిచెందాడు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

ఆకట్టుకున్న ప్రఖ్య బృందం నృత్యం


నృత్యప్రదర్శనలో తేజస్విప్రఖ్య (కుడి చివర), బృందం

తెనాలి: విశాఖపట్టణంలో జీ–20 దేశాల సదస్సు ప్రారంభ వేడుకల్లో తెనాలికి చెందిన ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య బృందం నృత్య ప్రదర్శన అలరించింది. కూచిపూడి నృత్య విభాగంలో 'అదివో...అల్లదివో' కీర్తనకు తేజస్వి ప్రఖ్య బృందం నృత్యాభినయం చేశారు. ఈ బృందాన్ని పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణశెట్టితో పాటు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పిట్టు కోటేశ్వరరావు, లక్కరాజు లక్ష్మణరాజు అభినందించారు.

పాఠశాల వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

మేడికొండూరు: పేరేచర్ల బాసర కాన్సెప్ట్ పాఠశాల వార్షికోత్సవం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుని రాణించాలన్నారు. బాసర కాన్సెప్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ కొండపల్లి విల్సన్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. పాఠశాల డైరెక్టర్ సాదినేని మురళీ మోహన్ మాట్లాడుతూ ఉన్నత స్థానాలు విద్యతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల బోర్డు డైరెక్టర్ సాదినేని రాధ, ఎంపీపీ మన్నవస్వప్న రాజేష్, సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయ జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం చేపట్టారు. వడ్డేశ్వరం శివారు నుంచి జాతీయ రహదారి వరకు రెండు వైపులా ముళ్లపొదలు పిచ్చి మొక్కలు పెరగడంతో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి స్థానికంగా ఉన్న వారు వాట్సప్ ద్వారా మెసేజ్ చేశారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి జంగిల్ క్లియరెన్స్ చేయాలని సూచించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

31లోగా ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలి

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను ఈనెల 31వ తేదీలోగా ఒకేసారి చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని నగర కమిషనర్ యు.శారదాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లోని కార్పొరేషన్ కార్యాలయాల్లోని రెవెన్యూ విభాగాలతో పాటు ఆయా సచివాలయాల్లో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

పైప్‌లైన్ల ఆధునికీకరణ


తాడేపల్లి 13వ వార్డులో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో రాబోయే వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో 7 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్లు వేయడంతోపాటు పాత పైపులైన్లను మరమ్మతులు చేసేందుకు బుధవారం కార్పొరేషన్ సిబ్బంది శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో తాడేపల్లి పట్టణ పరిధిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, ఎర్ర క్వారీ, తెల్ల క్వారీ, బ్రహ్మానందపురం, ప్రకాష్ నగర్‌లో పైపులైను మరమ్మతులు చేపట్టారు. బ్రహ్మానందపురం స్కూల్ వెనుక భాగంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో సుమారు 500 మీటర్ల పొడవున కొత్త పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు ఏఈ ప్రవీణ్ తెలిపారు. తాడేపల్లిలో కొత్త పైపులైను నిర్మాణ పనులను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తామని, 15 రోజుల్లో పనులు పూర్తిచేసి తాగు నీటి సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

గంజాయి స్వాధీనం

తెనాలి రూరల్: పెద్దమొత్తంలో గంజాయిని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి ఐతానగర్ ప్యాడిసన్‌పేట కమ్యూనిటీ హాలు వద్ద ఐలా శ్రీనివాస్, మరో ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి 14.50 కిలోల గంజాయి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు నందులపేటకు చెందిన వారు కాగా నలుగురు ఐతానగర్ వారే.

ఏప్రిల్ 15 నాటికి ఈత కొలను నిర్మాణం పూర్తిచేయాలి

- మగ్గాల షెడ్లను సత్వరమే పూర్తి చేసి కార్మికులకు కేటాయించాలి
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలోని ఆత్మకూరు గుంటూరు చానల్ వద్ద గల తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణం జరుపుకుంటున్న స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం ఇండోర్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్‌తో పాటు రాజీవ్ గృహకల్ప ఆవరణలో నిర్మాణం జరుపుకుంటున్న చేనేత మగ్గం షెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. వేసవి నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో పాఠశాలలకు సెలవులు రానుండటంతో పిల్లలు స్విమ్మింగ్, స్కేటింగ్ నేర్చుకునేందుకు వస్తారని, నిర్మాణ పనులను వేగవంతం చేసి పాఠశాలలకు సెలవులు ఇచ్చే నాటికి పూర్తి చేయాలన్నారు. మహిళలకు, యువతకు ప్రత్యేక వసతులతో గదులు నిర్మించడంతోపాటు ప్రత్యేక సమయాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద రూ.2 కోట్లతో చేపట్టిన మగ్గంషెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులైన కార్మికులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రాజీవ్ గృహకల్ప వద్ద చేపట్టిన రజక కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆత్మకూరు మాజీ సర్పంచ్ బొమ్ము శివ రామిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సీతామహాలక్ష్మి, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, దాసరి వీరయ్య, డీవీఆర్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనో ఉల్లాసం మనిషి మనుగడకు ముఖ్యం

కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ

తాడేపల్లిరూరల్ : మానసిక సంతోషం మనిషి మనుగడకు ముఖ్యమని కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ చెప్పారు. బుధవారం తాడేపల్లిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 12న తమ విశ్వవిద్యాలయంలో ఆటిజం, మానసిక ఆరోగ్య సవాళ్లపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని, పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 5లోపు ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు. కేఎల్‌యూ అంతర్జాతీయ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, తమన ఫౌండేషన్ సంయుక్తంగా నూతన నైపుణ్యాభివృద్ధి ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మానసిక అనారోగ్యానికి సరైన సమయంలో వైద్యం అందిస్తే ఫలితం ఉంటుందని వెల్లడించారు. వర్క్‌షాప్‌లో నిమ్‌హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమ మూర్తి, డాక్టర్ షాయమ చోనా, గుంటూరు దాక్షిణ్య ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ శామ్యూల్, చీఫ్ కార్డియోథోరిక్ సర్జన్ జె.కె. అబ్రహాం తదితరులు పాల్గొననున్నారని వివరించారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం వసుజ 99895 45567, శ్రీకాంత్ 84660 11222, పావని 94942 39650 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఏపీ కాఫ్ట్ సభ్యులు, కార్యదర్శి ప్రొఫెసర్ అపర్ణ, ఎస్‌బీఐ మంగళగిరి రీజనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి గుహల సందర్శన


ఉండవల్లి గుహల వద్ద ఎన్‌సీసీ విద్యార్థులతో లెఫ్టినెంట్ మౌనిక తదితరులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విద్యార్థులు ట్రెక్కింగ్‌లో భాగంగా బుధవారం ఉండవల్లి గుహలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌సీసీ 22 తెనాలి బెటాలియన్ లెఫ్టినెంట్ మౌనిక మాట్లాడుతూ తమ క్యాడెట్లకు ట్రెక్కింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఉండవల్లిలో ఉన్న చారిత్రాత్మక గుహలను సందర్శించామని వెల్లడించారు. ఏపీ ఎన్‌సీసీ 22 తెనాలి బెటాలియన్ అధికారిణి డాక్టర్ పావని ఉండవల్లి గుహలకు ఉన్న చారిత్రక విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఎన్‌సీసీ బృందాన్ని విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సమన్వయకర్త జి.చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరుకు చెందిన మోర్ల శాంతబాబు (21)కు ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా శాంతబాబు వ్యసనాలకు బానిసగా మారడంతో భార్యతోపాటు తల్లి మందలించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం తన నివాసంలో అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శాంతబాబు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.